క్లుప్తంగా

సెర్ప్ అంశాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఏపీడీ నూరుద్దీన్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి, వేంసూరు మండలాల వీఓఏలు, సీసీలతో స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం డీఆర్‌డీఓ ఏపీడీ నూరుద్దీన్ సమీక్ష నిర్వహించారు. రికవరీ, మహిళా శక్తి పథకాలు, మీసేవా కేంద్రాలు, పాడి పరిశ్రమలు, కోళ్ల పెంపకం, చేపల పెంపకం, క్యాంటీన్ నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు సుబ్బారావు, శ్రీనివాసరావు, డ్వాక్రా ఈఓ రత్నకుమారి, డీఎంజీ జనార్దన్‌రావు, సీసీలు శ్రీనివాస్, రామారావు, చెన్నారావు, కృష్ణ, నరేందర్, షబ్బీర్ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విద్యపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ కమల

వేంసూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను పకడ్బందీగా అమలు చేసేందుకు టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్లు కమల, భవాని, మల్లీశ్వరి తెలిపారు. బుధవారం వేంసూరు మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలపై వేంసూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాస్టర్ ట్రైనర్ కమల అవగాహన కల్పించారు.

కొత్త చట్టాలను సవరణ చేయాలి



నిరసన దీక్షల్లో న్యాయవాదులు

సత్తుపల్లిటౌన్: కొత్త చట్టాలలో ప్రజా వ్యతిరేక చట్టాలను సవరణ చేయాలని కోరుతూ సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో నరేంద్ర, టి.బాలరాజు, ఎం.నరేష్, ఎం.కిషోర్ ఉన్నారు. వీరికి సత్తుపల్లి, దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు తేళ్లూరి ఆడమ్స్, మారం సతీష్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు కూకలకుంట రవి, జానికిరామారావు, కేఎస్‌పీ ప్రసాద్‌రెడ్డి, బుజ్జీసాహెబ్, సుంకర లక్ష్మణ్‌రావు, కృష్ణప్రసాద్ సంఘీభావం తెలిపారు.

క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



పేరువంచ జెడ్పీహైస్కూల్‌లో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

కల్లూరురూరల్: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని హెచ్‌ఎం సీహెచ్ సుదర్శన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పేరువంచలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్‌డేను ఘనంగా నిర్వహించి మాట్లాడారు. క్రీడల్లో నైపుణ్యం సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం గుర్తింపు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మౌలాలి, ఎస్.శ్రీనివాసరావు, శిరీష, సురేష్‌బాబు, రామానాయక్, ఎంవీకే జ్యోతి, జాని, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: జాతీయస్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో సత్తుపల్లి విద్యార్థులు ప్రతిభ చూపారు. కాకినాడ నృత్యాంజలి ఆధ్వర్యాన ఈ నెల 7, 8, 9వ తేదీల్లో శాస్త్రీయ నృత్యోత్సవం నిర్వహించారు. వీఎంఆర్ ఆర్ట్స్ అకాడమి పోటీల్లో సత్తుపల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన నత్యాచారి అనూష్ బహదూర్ తో పాటుగా.. విజేతలు ఆరాధ్య, వేద్య యశ్వత, నందన, సహస్ర, దైవికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న సర్వసభ్య సమావేశం

ఏన్కూరు: ఈ నెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సకినాల రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావలసిందిగా కోరారు.

నాటేది.. నరికేందుకేనా..?

- వేటుకు గురవుతున్న వృక్షాలు
- ఈ ఏడాదైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికుల విన్నపం



వేంసూరు-చౌడవరం రహదారి వెంట నరికిన మొక్కలు





మోడుగా మారిన చెట్లు

వేంసూరు: ఇటు అధికారులు, అటు పాలకులు అవగాహన లోపంతో ప్రజలు సొమ్ము దుర్వినియోగం అవుతుంది. కోట్లాది రూపాయిలు ఖర్చుచేసి నాటిన చెట్లను నరికివేస్తున్నారు. ఇది మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తెలంగాణాకు హరితహారం పేరులో గ్రామాల్లో నాటుతున్న మొక్కల పరిస్థితి.

వేల సంఖ్యలు మొక్కలు నాటుతున్నారు..

ప్రభుత్వం హరితహారం పేరుతో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటిస్తోంది. ప్రతి ఏటా ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోకపోవండతో నాటిన కొన్నాళ్లకే నరుకుతున్నారు. ప్రతి గ్రామంలో లక్షలు ఖర్చు చేసి నర్సరీలు పెంచుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటుతున్నారు. గతేడాది ప్రతి గ్రామ పంచాయతీకి 10వేల మొక్కలు పెంచారు. కానీ మొక్కలు నాటడంలో అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటినవి ఏపుగా పెరిగేందుకు డబ్బులు ఖర్చుచేసి కంచెలు వేయడం, నీళ్ల పోయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ కరెంట్ లైన్‌ల కింద, పైపులైన్ ప్రాంతంలో మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు.

ఈ ఏడాదైనా తగు చర్యలు తీసుకోవాలి..

కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న వనమహోత్సవంలోనైనా అధికారులు గతంలో చేసిన తప్పులు సరి చేసుకొని విద్యుత్ తీగలు పైపు లైన్ ఉన్న ప్రాంతంలో మొక్కలు నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా మొక్కలు నాటి చేతులు దులుపుకోకుండా వాటి రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు.

అధికారులు దృష్టి సారించాలి..



గతంలో అధికారులు విద్యుత్ తీగలు కింద మొక్కలు నాటి అవి ఏపుగా పెరిగాక విద్యుత్ సిబ్బంది నరుకుతున్నారు. విద్యుత్ తీగలు లేని ప్రాంతంలో మొక్కలు నాటి రక్షించాలి.

– సత్యనారాయణ, చౌడవరం

జాగ్రత్తలు తీసుకుంటున్నాం..



విద్యుత్ తీగలు, తాగునీటి వైపు లైన్లు ఉన్న ప్రాంతంలో కాకుండా మిగతా చోట్ల గుంతలు తీయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు వివరించాం. నాటిన ప్రతీ మొక్క బ్రతికేలా చర్యలు చేపడతాం.

– కోటేశ్వరరావు, ఏపీఓ, వేంసూరు

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత



వైరా జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



మధిరరూరల్: పాఠశాలలో మొక్క నాటుతున్న దృశ్యం



కల్లూరురూరల్: మర్లపాడులో మొక్కనాటుతున్న ఎంఈఓ దామోదర్ ప్రసాద్, ఉపాధ్యాయులు

వైరా/ఏన్కూరు/మధిరరూరల్/బోనకల్/కల్లూరు రూరల్/సత్తుపల్లిటౌన్: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ జైపాల్, ఎంపీడీఓలు ఎంపీడీఓ ఎల్ రాజు, సకినాల రమేష్, నాగవరప్పాడు పాఠశాల హెచ్‌ఎం సంగారావు, ఎంఈఓ దామోదర్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఏన్కూరు, మధిర జెడ్పీ ఉన్నత పాఠశాలలో, బోనకల్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కల్లూరు మండలంలోని మర్లపాడు, చిన్నకోరుకొండి, పేరువంచ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో నాటిన మొక్కలను బాధ్యతగా పెంచాలని, పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంటలు మంచిగా పడతాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, వార్డు కౌన్సిలర్ బత్తుల గీత, తహసీల్దార్లు శ్రీనివాస్, పున్నం చందర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, ఎంఈఓ దుగ్గిరాల జయరాజు, హెచ్‌ఎం కూరకుల సైదయ్య, ఉపాధ్యాయులు బత్తుల వెంకటేశ్వర్లు, రాఘవరావు, రాధాకృష్ణ, శ్రీధర్, కస్తూరి, విజయలక్ష్మి, పుల్లయ్య, తోక కృష్ణయ్య, సీహెచ్ వి.రవికుమార్, లింగయ్య, నాగేంద్రమ్మ, కృష్ణవేణి, కల్లూరు ఎస్సై ఎస్‌కె షాకీర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమణ, హెచ్‌ఎంలు సోమల్లా నాయక్, సీహెచ్ సుదర్శన్‌రావు, ఉపాధ్యాయులు డి.శిరీష, ఎండి మౌలాలి, శ్రీనివాసరావు, జి.సురేష్, సాగర్, జ్యోతి, వైస్ ఎంపీపీ రమేష్, కళాశాల ప్రిన్సిపాల్ నళిని, ఎంపీఓ శాస్త్రీ, ఆర్‌ఐ లక్ష్మణ్, ఏపీఓ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మురళి



బోనకల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మధిర నియోజకవర్గ వైఎస్సార్ యూత్ నాయకుడు రావినూతల గ్రామానికి చెందిన గణపారపు మురళి బుధవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో కలిశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు దొబ్బల ఈశ్వరమ్మకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ఈశ్వరమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అప్పారావు, సీపీఐ నాయకులు గోవిందరావు, నర్సింహారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి శిక్షణా తరగతులు

మధిర: ఈ నెల 14 నుంచి దెందుకూరు సమీపంలోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు జరుగుతాయని ఆ పార్టీ మధిర మండల కార్యదర్శి మందా సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. వివిధ అంశాలపై చర్చించి పార్టీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుందని అన్నారు. పార్టీ మండల పట్టణ, స్థాయి నాయకులు ఈ శిక్షణా తరగతులకు తరలిరావాలని కోరారు.

వృత్తిలో పదవీ విరమణ సహజమే..



పదవీ విరమణ పొందిన రవి దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

ఏన్కూరు: వృత్తిలో పదవీవిరమణ సహజమేనని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక గురుకుల విద్యాలయంలో సహాయ కార్యదర్శిగా పనిచేసి పదవీవిరమణ పొందిన కొడుమురు రవిని శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. ఉపాధ్యాయులు శేషయ్య, నాగభూషణం, అంజలి, సుదర్శన్, రమ, రిటైర్డ్ టీచర్ చందులాల్, హరిలాల్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రిలో మోహన్‌రావు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బుధవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నరేష్ తెలిపారు.

విద్యుత్‌లైన్ టెక్నికల్ చార్జింగ్



పమ్మి సబ్‌స్టేషన్‌లో చార్జింగ్‌ను ప్రారంభిస్తున్న ప్రాజెక్ట్ సీజీఎం రాజుచౌహాన్

ముదిగొండ: మండలపరిధిలో పమ్మి 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కమలాపురం 33/11కేవీ విద్యుత్‌లైన్ టెక్నికల్ చార్జింగ్‌ను టీజీఎన్‌పీడీసీఎల్ ప్రాజెక్ట్స్ వరంగల్ సీజీఎం రాజుచౌహాన్ బుధవారం ప్రారంభించారు. పమ్మి 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కమలాపురం33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 4.9కి.మీ 33కేవీ విద్యుత్‌లైన్ నిర్మాణం ఇటీవల చేపట్టారు. విద్యుత్‌లైన్ నిర్మాణం పూర్తికావటంతో టెక్నికల్ చార్జింగ్‌ను సీజీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈలు భద్రు పవార్, నాగేశ్వరరావు, హీరాలాల్, ఏడీలు భీం సింగ్, కిరణ్‌చక్రవర్తి, ఏఈలు నారాయణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

తల్లాడ: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని సీపీఎం తల్లాడ మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం కుర్నవల్లిలో.. శీలం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో కౌలు రైతులను గుర్తించి రైతులకిచ్చే అన్ని రాయితీలను వర్తింపజేయాలన్నారు. ఈ సమావేశంలో శీలం ఫకీరమ్మ, పులి కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, వంగూరి లోకేశ్వర్‌రావు, తెనాలి కృష్ణమ్మ, చల్లా నాగేశ్వర్‌రావు, నన్నే సాహెబ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జీపీఎస్ ఉండాలి

మధిర: ఇసుకను తరలించేటప్పుడు ఇసుక కూపన్‌తో పాటు ట్రాక్టర్‌కు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఉండాలని మధిర తహసీల్దార్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీపీఎస్ లేకపోయినా, కూపన్ లేకపోయినా ఇసుకను అక్రమంగా తరలిస్తే జరిమానాతో పాటు మోటార్ వెహికల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా అక్రమ రవాణా చేసే వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కలిగిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. బుధవారం మండలంధిలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ వైద్యసేవలు అందించి మాట్లాడారు. ఫిజియోథెరపీ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని.. అవసరమైన వారికి సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు దివ్యాంగ పిల్లలకు సహాయ పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొదుమూరు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాసరావు, లచ్చగూడెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్.మహ్మద్ హుస్సేన్, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం సత్యవేణి, ఐఈఆర్పీలు కేఎస్.కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన



కిష్టాపురంలో పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



తుంబూరు వద్ద నల్లకాలువకు పడిన గండి

సత్తుపల్లి: మండలంలోని కిష్టాపురం, తుంబూరు గ్రామాల్లో వర్షంతో దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బుధవారం పరిశీలించారు. చింతంపల్లి, రామగోవిందాపురం గుట్టలపై నుంచి వరద పోటెత్తి బేతుపల్లి ముళ్ల కాలువ మీదుగా రావటంతో నేషనల్ హైవే పనులు జరుగుతున్న హైలెవల్ బ్రిడ్జి వద్ద పోటెత్తటంతో నల్లకాలువకు 20 మీటర్ల మేర, ఎర్రకాలువకు మూడుచోట్ల గండ్లు పడ్డాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. జాతీయ రహదారి పనులప్పుడే మూడు తూరలు వేయాలని చెప్పినా.. ఒక తూర వేయటం వల్లే వరద పోటెత్తి కాలువలకు గండ్లు పడ్డాయని, దీనివల్ల సుమారు పది ఎకరాల మేర వరి పొలాల్లో ఇసుకమేట వేసిందని రైతులు వివరించారు. నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు వివరించారు. తక్షణం గండ్లు పూడ్చాలని అధికారులను ఆదేశించారు. గండ్లు పడిన ప్రాంతాలను ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ వెంకటేశ్వరరావులు పరిశీలించారు. హుటాహుటీన గండ్లను పూడ్చివేశారు. ఇసుక మేట వేసిన పంట పొలాలను తక్షణం బాగు చేయించాలని నేషనల్ హైవే కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.

అసంఘటితరంగ కార్మిక వర్గాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

తల్లాడ: అసంఘటితరంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న అన్నారు. బుధవారం తల్లాడలో పటాన్ నాగుల్‌మీరా అధ్యక్షతన నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ ఐదో మహాసభలో ఆయన మాట్లాడారు. అసంఘటితరంగ కార్మికులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకపోవడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా దానిని పాలక వర్గాలు బుట్ట దాఖలు చేశాయని ఆరోపించారు. కార్మికులు ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ తల్లాడ, ఏన్కూర్ ఏరియా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పటాన్ నాగుల్‌మీరా, డి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సభలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.లాల్ మియా, బ్రాంచ్ కమిటీ నాయకులు నాగేశ్వరరావు, రమణ, సత్యం, గురవయ్య, పెద్ద వెంకటి, రాఘవ రామకృష్ణ, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, వెంకన్న, రాఘవరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కారేపల్లి: తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏన్కూరు/కారేపల్లి: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు, సీఐటీయూ మండల కన్వీనర్ కె నరేంద్ర డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా బుధవారం ఏన్కూరులోని తహసీల్, ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావుకు వినతిపత్రం అందించగా.. కారేపల్లిలోని తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి ఆర్‌ఐ సామినేని నరసింహారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు, ఆశలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల 9నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్‌కే హుస్సేన్, బోళ్ల కొమరయ్య, ఎం స్వరూపరాణి, అజ్మీర సుక్యా, రాంబాబు, మాలోతు పాప్యా, ఆదెర్ల గౌతమ్, శ్రీరాములు, మంగ, సుల్తానా, వెంకటేశ్, స్వాతి, అచ్చమ్మ, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కంట్రోల్ రూం ఏర్పాటు

సత్తుపల్లిటౌన్: వర్షాకాలం దృష్ట్యా సత్తుపల్లి పట్టణ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వార్డుల్లో ఇళ్లు కూలిపోవటం, నీరు నిల్వటం, దోమల బెడద నివారణకు మున్సిపల్ కార్యాలయం కంట్రోల్ రూం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమాచారాన్ని 9704671081 నంబర్‌కు ఇవ్వాలని కోరారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సీఏడీ ఎనోష్‌కుమార్, తహసీల్దార్ సాంబశివుడు

కల్లూరు: సెంటర్ ఫర్ డవలప్‌మెంట్ యాక్షన్ కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ పులి సాంబశివుడు చేతుల మీదుగా 20 మంది మహిళలకు రూ. 1.60 లక్షల కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కల్లూరులోని చంద్రుపట్ల రోడ్‌లోని టీజీఎమ్ హాస్టల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లలో నిరుపేద మహిళలకు 6 నెలల పాటు దుస్తులు కుట్టడంలో శిక్షణ ఇచ్చి మిషన్లు అందించారు. కార్యక్రమంలో మట్టూరి జనార్దన్, కాటేపల్లి రజనీకాంత్, పోట్రు కిరణ్‌కుమార్, దామాల రాజు, సంజీవరావు, సుందర్‌రాజు, జీవన్, శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

చండీయాగానికి వేద పాఠశాల విద్యార్థులు



వారణాసిలోని చండీయాగానికి వెళ్తున్న విద్యార్థులు

వైరా: శ్రీ భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వారణాసి మహాక్షేత్రంలో నిర్వహించే చండీయాగానికి వైరాలోని వేద పాఠశాల విద్యార్థులు బుధవారం వెళ్తున్న సందర్భాన వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో లయన్స్ బాధ్యులు వారికి శుభకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, మరికంటి రాజగోపాల్, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, రాము తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ వితరణ

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల హరిజన వాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నరేష్ అధ్యయన్ ఐబిటీ దంపతుల కవల పిల్లలు లిఖిత, లితిక పుట్టినరోజుని పురస్కరించుకుని బుధవారం రూ.6 వేలు విలువైన నోట్ పుస్తకాలు, స్టేషనరీ వితరణ చేశారు. వీటిని కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.అబ్రహం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వాసిరెడ్డి రామ్మోహన్, ఉపాధ్యాయినులు జయ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రైమరీ, యూపీఎస్ పాఠశాలల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు ఎస్‌కె అబ్దుల్ సలాం, ఎస్ సుబ్బారావు, మిట్టపల్లి శ్రీధర్, పొన్నగంటి వినాయక ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఆర్ జ్ఞాపకార్థం బల్లలు ..

కారేపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మేదరి వెంకటేశ్వర్లు (ఎంవీఆర్) జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కారేపల్లి గ్రామంలోని కూడళ్లలో బల్లలను వితరణగా అందించారు. కారేపల్లిలోని బస్టాండ్ సెంటర్, సినిమాహాల్ సెంటర్, బొడ్రాయి బజార్, పెద్దమ్మ బజార్, బీసీ కాలనీ, భారత్‌నగర్ కాలనీలలో ప్రజలు కూర్చునేందుకు బల్లలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేదరి ఎలిజబెత్‌రాణి, మేదరి టోనీ, మేదరి రాజా, గ్రామ పెద్దలు సురేందర్ మనియార్, హనీఫ్, మజీద్‌పాషా, తాజుద్దీన్, షఫీ, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరురూరల్: మండలంలోని చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాథరాజు ఇటీవల అమెరికాలో మరణించగా.. ఆయనను తన స్వగ్రామానికి తీసుకొచ్చి సోమవారం అత్యక్రియలు చేసిన విషయం తెలిసిందే. కాగా.. వారిది నిరుపేద కుటుంబం కావడంతో అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్సై కుమ్మరి రామారావుతో పాటు నాగేశ్వరరావు, నరసింహారావు, కృష్ణమూర్తి ముందుకు వచ్చి రూ.51 వేలు సేకరించి మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. అదే విధంగా తమ పూర్వ విద్యార్థులు రూ.30వేలు అందజేశారు.

పాఠశాల ఆవరణలో విషసర్పం

మధిరరూరల్: సిరిపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులకు విషసర్పం కనిపించింది. చెట్ల పొదల్లో ఉన్న పామును గుర్తించి విద్యార్థులు కేకలు వేయడంతో సమీపంలో క్రికెట్ ఆడుతున్న కొంతమంది యువకులు వచ్చి పామును చంపారు. అత్యంత ప్రమాదకరమైన రక్తపింజరుగా గుర్తించి, విద్యార్థులు ఆడుకునే క్రమంలో పొదల సమీపంలోకి వెళ్లి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.